ప్రజాశక్తి

మంగళవారం 1 ఆగస్టు 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

నేటి నుంచి లోకేష్ యువగళం

- ముప్పరాజువారిపాలెం వద్ద పల్నాడు జిల్లాలోకి ప్రవేశం
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఏడు నియోజకవర్గాల్లో 15 రోజుల పాదయాత్ర
- లోకేష్ చేయనున్న విమర్శలపై ప్రతి విమర్శలకు సిద్ధమైన అధికార పార్టీ నేతలు

అద్దంకి నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా లోకేష్‌తో టిడిపి పల్నాడు జిల్లా నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర మంగళవారం ఉదయం నూజెండ్ల మండలం ముప్పరాజువారిపాలెం వద్ద పల్నాడు జిల్లాలోకి ప్రవేశించనుంది. దాదాపు 15 రోజులపాటు పల్నాడు, గుంటూరు జిల్లాలో పాదయాత్ర కొనసాగిస్తారు. వినుకొండ, మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు మీదుగా గుంటూరు జిల్లా తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో పాదయాత్ర కొనసాగుతుంది. పల్నాడు, గుంటూరు జిల్లాలు ముగిసిన తరువాత ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

▶ 2లో

సమస్యల పరిష్కార దిశగా పాదయాత్ర

- అవినీతి, అక్రమాలను ప్రజల ముందుకు తెస్తున్న లోకేష్
- శాసన మండలి మాజీ చైర్మన్ షేక్ షరీఫ్
- స్వాగతం పలికేందుకు శ్రేణులు తరలిరండి : జీవీ ఆంజనేయులు

విలేకర్లతో మాట్లాడుతున్న షరీఫ్, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

2లో

నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

కడప ఉక్కును కేంద్రమే నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వమే కడప ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కడప ఉక్కుపై కేంద్రం వైఖరికి నిరసనగా సోమవారం గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలో కడప ఉక్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎన్నికలప్పుడు వాగ్దానం చేసిన బిజెపి నేడు నిర్మాణానికి అవకాశం లేదని ప్రకటించడం మోసం చేయటమే అన్నారు. విభజన చట్టంలోని హామీలలో భాగంగా రాయలసీమ అభివృద్ధికి కీలకమైన కడప ఉక్కు ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించడం తగదన్నారు. విభజన చట్టంలోని హామీలలో భాగంగా రాజధాని నిర్మాణానికి, విశాఖ రైల్వే జోన్ నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైనదన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకులు ఇప్పటికైనా స్పందించి, కేంద్రాన్ని నిలదీయాలని, లేకపోతే ప్రజలు క్షమించరని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా ధారాదత్తం చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనకు వ్యతిరేకంగా దీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇ.అప్పారావు, ఎం.ఎ.చిష్టీ, బి.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, కె.అజయ్‌కుమార్, ఎల్.అరుణ, కె.శ్రీనివాస్, ఎస్.కె.ఖాశిం షహీద్, సమీర్, ఖాశింవలి పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన కూలీలు

అల్లరి మూకల వీరంగం

నలుగురు కూలీల పై దాడి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో పది మంది యువకులు వీరంగం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. కవిరాజా పార్క్ సమీపంలో సిమెంటులోడు దించుతున్న కార్మికులతో నలుగురు యువకులు ఘర్షణ పడ్డారు. అకారణంగా గొడవకు దిగటంతో కూలీలు ఎదురు తిరిగారు. దీంతో అక్కడి నుండి వెళ్లిన ఆ నలుగురు మళ్లీ పదిమందితో వచ్చి కూలీలపై కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. సమీపంలోని అపార్ట్మెంట్లో ఉన్నవారు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపైనా తిరగబడ్డారు. యువకుల దాడిలో గాయపడిన కూలీలను స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించారు. దీనిపై స్థానికులు పోలీసులకు

▶ 2లో

4లో

పల్నాడు జిల్లాకేంద్రం నరసరావుపేటలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

ప్రాణాలకు తెగించి సేవలు.. సరిగా దక్కని జీతాలు..

- కలెక్టరేట్ ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ధర్నా
- పిఆర్‌సి అమలు, కారుణ్య నియామకాలు, ఇతర సమస్యలపై జెసికి వినతి
- ప్రభుత్వం స్పందించకుంటే 10 తర్వాత ఎప్పుడైనా సమ్మె

విరమణ వయస్సు పెంపుపై ప్రొఫెసర్ల హర్షం

- ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నూటా ప్రదర్శన
- వర్సిటీ ఆధ్వర్యంలో త్వరలో ధన్యవాద సభ : వీసీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

యూనివర్సిటీల్లోని ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్ల నుండి 65 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వర్సిటీలో ప్రదర్శన నిర్వహించి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళు లర్పించారు. అనంతరం వర్సిటీలోని డైక్‌మెన్ ఆడిటోరియంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమానికి నాగార్జున యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (నూటా) ఆధక్షులు ప్రొఫెసర్ బి.నాగరాజు అధ్యక్షత వహించారు. వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని కొనియాడారు. వర్సిటీ ఆధ్వర్యంలో కొద్ది రోజుల్లో సిఎంకు ధన్యవాదాలు తెలిపే సభ నిర్వహిస్తామని ప్రకటించారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రమూ చేయని విధంగా సిఎం చేశారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెర్ బి.కరుణ, ఇతర ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వర్సిటీలో ప్రదర్శన చేస్తున్న ప్రొఫెసర్లు

నేటి నుంచి లోకేష్ యువగళం

(మొదటి పేజీ తరువాయి)

కుప్పం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఇప్పటి వరకు ఆరు ఉమ్మడి జిల్లాలు పూర్తిచేసి ఏడో జిల్లాలోకి ప్రవేశించనుంది.

వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లోకేష్ పాదయాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పాదయాత్ర పార్టీకి ఒక టానిక్‌లా పనిచేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పార్టీ నిస్తేజంగా ఉన్న ప్రాంతాలపై ఆయన దృష్టి సారించారు. పార్టీ నాయకుల మధ్య సమన్వయం పెంచుతూ కొత్త నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీలో నూతన ఉత్తేజాన్ని నింపుతున్నారు. పాదయాత్రలో వివిధ తరగతుల ప్రజలను ఆయన కలుస్తున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఆయా తరగుతుల ప్రజలకు ఏమి మేలు చేయగలనో హామీలు ఇస్తున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలతోపాటు వైసిపి ఎమ్మెల్యేలు, నాయకుల అవినీతిపైనా ఎండగడుతున్నారు. ఇదేరీతిలో పల్నాడులో వైసిపి ఎమ్మెల్యేలు, నాయకుల అవినీతి అక్రమాలపై లోకేష్ ప్రముఖంగా ప్రస్తావించే అవకాశం ఉంది. దీంతో లోకేష్ పర్యటనపై వైసిపి నాయకుల్లో కూడా ఆసక్తి పెరుగుతోంది. లోకేష్ ఏ విధమైన విమర్శలు చేస్తారు? వాటికి తాము ఎలా బదులు ఇవ్వాలో కూడా వైసిపి ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు సిద్ధం అవుతున్నారు.

పల్నాడు జిల్లాలో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో తరహాలో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్టు జిల్లా నాయకులు ఇప్పటికే లోకేష్ బృందానికి సమాచారం పంపారు. ఆయా అంశాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించనున్నారు. వినుకొండ, మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను, ఇవ్వాల్సిన హామీలను, టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి పథకాలు నిలిచిపోయిన వైనంపై ఇప్పటికే ఆయన సమాచారం తెప్పించుకున్నారు. మరోవైపు పల్నాడు జిల్లాలో తరచూ శాంతి భద్రతల సమస్య తలెత్తుతున్న నేపథ్యంలో కొంత మంది ఎమ్మెల్యేల తీరును కూడా ఆయన దుయ్యబట్టనున్నారు. ఇటీవల వినుకొండలో జరిగిన ఘర్షణ, గతంలో నర్సరావుపేట, గురజాల, మాచర్లలో జరిగిన ఘటనలను కూడా ఇప్పటికే లోకేష్ అధ్యయనం చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా పల్నాడు జిల్లాలో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో లోకేష్ పర్యటన కార్యకర్తల్లో ఉత్సాహం, భరోసా తెస్తాయని పార్టీ నాయకులు భావిస్తున్నారు. వైసిపి నాయకుల దాడులకు భయపడి బయటకురాని వారు లోకేష్ పర్యటనతో బయటకు వస్తారని కూడా చెబుతున్నారు.

యువగళం పాదయాత్ర షెడ్యూల్

ఉదయం 8 అద్దంకి నియోజకవర్గం కెలంపల్లి శివారు క్యాంప్ సైట్ నుంచి పాదయాత్ర ప్రారంభం.

8.20 గంటలకు కెలంపల్లిలో స్థానికులతో మాటామంతీ

8.35 గంటలకు వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశం

8.55 గంటలకు ముప్పరాజువారిపాలెంలో స్థానికులతో సమావేశం

10.10 గంటలకు రాముడుపాలెంలో స్థానికులతో సమావేశం

11.10 గంటలకు పుచ్చనూతల జెసి నగర్‌లో స్థానికులతో సమావేశం

11.40 గంటలకు రవ్వవరంలో స్థానికులతో సమావేశం

మధ్యాహ్నం 12.10 గంటలకు పుచ్చనూతలలో భోజన విరామం

సాయంత్రం 4 గంటలకు పుచ్చనూతల నుంచి పాదయాత్ర కొనసాగింపు

4.20 గంటలకు కొత్తరెడ్డిపాలెంలో స్థానికులతో సమావేశం

4.40 గంటలకు లక్ష్మీపురంలో స్థానికులతో సమావేశం

5.40 గంటంలకు నూజెండ్లలో స్థానికులతో సమావేశం

రాత్రి 7.10 గంటలకు గుర్రపునాయుడుపాలెంలో రైతులతో సమావేశం

7.30 గంటలకు గుర్రపునాయుడుపాలెం శివారు విడిది కేంద్రంలో బస

సమస్యల పరిష్కార దిశగా పాదయాత్ర

- అవినీతి, అక్రమాలను ప్రజల ముందుకు తెస్తున్న లోకేష్
- శాసన మండలి మాజీ చైర్మన్ షేక్ షరీఫ్
- స్వాగతం పలికేందుకు శ్రేణులు తరలిరండి : జీవీ ఆంజనేయులు

మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి పాలనలోని అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తున్నారని, ఆధిపత్యం కోసం అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తున్నారని శాసన మండలి మాజీ చైర్మన్ షేక్ షరీఫ్ విమర్శించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర పల్నాడు జిల్లా మంగళవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలన కోసం షరీఫ్ వినుకొండకు సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాలంటీర్లను పార్టీ కార్యకర్తల వ్యవస్థగా సిఎం మార్చుకున్నారని, అనుకూలంగా లేకుంటే పథకాలు అందవనే స్థాకికి పరిస్థితిని దిగజార్చారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలుపుతూ లోకేశ్ పాదయాత్ర చేస్తున్నారని, ప్రభుత్వ అవినీతి అక్రమాలను సెల్ఫీల ద్వారా ప్రజల ముందుకు తెస్తున్నారని అన్నారు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కార దిశగా హామీలు ఇస్తున్నారని చెప్పారు. పాదయాత్ర ద్వారా లోకేశ్ ప్రజల్లో చైతన్యాన్ని తెస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టుల పట్ల జగన్‌మోహన్‌రెడ్డి మంగళం పాడి రైతులను మోసం చేశాడని విమర్శించారు. చివరి దశలో ఉన్నవాటినీ పూర్తి చేయలేదన్నారు. ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యాయని, ఆ పార్టీని ఓడించడానికి ఎదురు చూస్తున్నారని అన్నారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి పాలనలో ప్రవేశపెట్టిన 83 సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం తొలగించి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాలు చేసి దోచుకునేందుకు సిఎం నేరుగా లైసెన్స్ ఇచ్చినట్టుగా ఉందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన జగన్ వారికి తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో లోకేశ్ చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన వస్తోందన్నారు. జిల్లాలో పాదయాత్రకు స్వాగతం పలికేందుకు టిడిపి నాయకులు, శ్రేణులు వేలాదిగా తరలివస్తున్నారని చెప్పారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు వినుకొండ పట్టణంలోని శివయ్య స్తూపం-పల్నాడు రోడ్డు మధ్యలో బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు 50-60 వేల మంది జనం పాల్గొననున్నారని తెలిపారు. పల్నాడు జిల్లాలో మంగళవారం ప్రారంభమయ్యే పాదయాత్రలో ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమన్వయంతో పని చేయండి : కన్నా

ప్రజాశక్తి-ముప్పాళ్ల

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని విజయం వైపు నడిపించేందుకు అనుబంధ సంఘాలన్నీ సంయుక్తంగా, సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో జరిగిన సమా వేశంలో కమిటీలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శులను మర్యాదపూర్వకంగా పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పార్టీ పదవులను పొందిన ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందాలంటే తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చుకోవాలని అందుకు అందరిని కలుపుకుంటూ సమిష్టిగా కషి చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కమిటీలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా బత్తుల నాగేశ్వరరావు కొనసాగుతుండగా మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పోలూరి యల్లమంద,తెలుగుయువత అధ్యక్షుడిగా గంజి వెంకట గోవిందు,టిడిపి ఎస్సి సెల్ అధ్యక్షుడిగా కందుల జార్జీ, టిడిపి బిసి సెల్ అధ్యక్షుడిగా ఎల్పూరి శివయ్య, టిడిపి రైతు కమిటీ అధ్యక్షుడిగా దివ్యకోలు భాస్కర్ రావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా తుపాకుల శ్రీనివాసరావు,మహిళా కమిటీ అధ్యక్షురాలు సంగేపు సీత నియమితులయ్యారు.

యార్డులో దళారులను రానివ్వను

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులోకి దళారీలను రానివ్వబోనని నూతన చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. చైర్మన్‌గా సోమవారం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. లోకేష్ యువగళం పాద యాత్ర గురించి ఆయన ప్రస్తావిస్తూ బిసిలకు ఏమాత్రం న్యాయం చెయ్యని పార్టీ టిడిపి అని విమర్శించారు. చంద్రబాబు హయంలో బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా వినియోగించి మొక్కుబడి పథకాలు అమలు చేశారని అన్నారు. ఎంత మంది బిసిలకు కీలక పదవులు ఇచ్చారో లోకేష్‌చెప్పాలన్నారు. వైసిపి హయంలో బిసిలకు అగ్రతాంబూలం లభించిందన్నారు. జగన్ పాదయాత్రకు, లోకేష్ పాదయాత్రకు పోలికే లేదన్నారు.

నేటి నుండి ఇంజినీరింగ్ కళాశాల మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఎ.ఎన్.యు. ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ 2023 , కౌన్సెలింగ్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఆగస్టు ఒకటి నుండి డా.వై ఎస్.ఆర్ ఎ.ఎన్.యు. ఇంజినీరింగ్ కళాశాల మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభం అవుతాయని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. సిద్దయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు త్వరితగతిన తరగతులకు హాజరవాలని సూచించారు.

పెట్రోల్ బంకులలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,బాపట్లలో పెట్రోలు బంకుల్లో విజిలెన్సు అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. యజమానులు ప్రభుత్వం వారి నిబంధనలు ఖచ్చితంగా అమలు చేస్తున్న తీరు తెన్నులు, ఫ్యూయల్ ట్యాంక్ ల నిర్వహణ, నిబంధనలు జాగ్రత్తలకు సంబంధించిన మొదలగు అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో పలు లోపాలను గుర్తించారు. పై తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరావు, తహసిల్దార్ కె.నాగమల్లేశ్వర రావు, గుంటూరు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, లక్ష్మీ నారాయణ రెడ్డి, బాపట్ల అసిస్టెంట్ కంట్రోలర్ లిల్లి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం చేసిన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

అనారోగ్యంతో మంచంలో ఉన్న 85 సంవత్సరాల వృద్ధురాలిపై అఘాయిత్యం చేసి, చెవికమ్మలను దొంగతం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు సిఐ వెంకట సుబ్బారావు సోమవారం మీడియాతో మాట్లాడారు. ఘటన జరిగిన 12 గంటలలోపే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పెదనందిపాడు నల్లమడ వాగు కట్టమీద నివాసముంటున్న పాలపర్తి మంజు (22)ను దొంగిలించిన సొమ్ముతో సహా అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడు మంజును బాపట్ల కోర్టుకు తరలించారు. కోర్టులో అతనికి 15రోజులు రిమాండ్ కోసం గుంటూరు జైలుకు తరలించినట్లు తెలిపారు. కేసును గంటల వ్యవధిలో చేధించిన పోలీసులను, పోలీస్ శాఖను గ్రామస్తులు అభినందించారు.

మణిపూర్‌లో శాంతిని కోరుతూ కొవ్వొత్తులతో ప్రదర్శన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ తెలుగు బాపిస్టు చర్చిఫాస్టర్స్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వద్ద కొవ్వుత్తుల ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులపై దాడులను నిలిపేయాలని, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఫాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో దారుణ మారణకాండ, అకృత్యాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, ఇతర మత సంస్థల నుంచి క్రైస్తవులను రక్షించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని, వీటి నివారణకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. రెవరెండ్ రెబ్బా ఇమ్మానియేల్, డాక్టర్ పరదేశిబాబు, డాక్టర్ ఎం.బాలస్వామి, శామ్యూల్ జొనాథన్, విజయకుమార్ ర్యాలీని ప్రారంభించగా బిషప్ బి.జాకబ్, మాత్యూస్, ప్రేమ్‌కుమార్, జాలాపాల్, జి.ఎం రాజు, బి.జోసఫ్, పి.బాపూజి, మోహన్, ఫిన్నీ, పి.జీవన్ బోస్, బి.థామస్, రూజ్‌వెల్ట్, డేవిడ్, విల్సన్ పాల్గొన్నారు.

నవజాత శిశువు చికిత్స కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి పిడియాట్రిక్ వార్డులో నవ జాత శిశువు చికిత్స కేంద్ర నిర్మాణం కోసం సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. జాతీయ హెల్త్ మిషన్ పథకం కింద ఈ పనులు జరుగుతుతాయి. ఈ నిర్మాణం పూర్తి అయితే 20 పడకల నుంచి 40 పడకలు వరకు పెరుగుతాయని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమం లో సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్, పిడియాట్రిక్ విభాగం డాక్టర్ మోహన చంద్ర, డాక్టర్ రమేష్ కుమార్, ఏపీ యం ఎస్ ఐ డి సిఏ ఈ కుంచె వెంకట రత్తయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ కె సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లరి మూకల వీరంగం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా యువకులంతా గంజాయి మత్తులో ఉన్నారని, ప్రతిఘటించినా, మాట్లాడే ప్రయత్నం చేసినా వారు అర్థం చేసుకునే స్థితిలో లేరని స్థానికులు చెబున్నారు. యువకులు చేసిన వీరంగానికి స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

మణిపూర్ ఘటనలపై నిరసనలు.. ర్యాలీలు

ఎర్రబాలెంలో..

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్: బిజెపి పాలిత మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న నరమేధాన్ని నిరసిస్తూ, రాజధానిలోని ఎర్రబాలెంలో సిఐటియు, రైతు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి పాల్గొని మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడటంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. తన స్వార్ధ ప్రయోజనాల కోసం దేశంలో మత కల్లోలాలు సృష్టించి, ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చి, తమ పబ్బం గడుపుకునేందుకు కుట్రలు సాగిస్తున్న బిజెపికి గుణపాఠం చెప్పేందుకు ప్రజల సిద్ధం కావాలని అన్నారు. కార్య క్రమంలో రైతు సంఘం రాజధాని డివిజన్ నాయకులు అత్తలూరి వీర వెంకయ్య, సిఐటియు నాయకులు బాబు, ఆదిలక్ష్మి, రామారావు, మహిళా సంఘం నాయకులు పార్వతి , మేరీ తిరుపతమ్మ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - పల్నాడు జిల్లా:** నరసరావుపేటలో సార్వ త్రిక క్రైస్తవ, హిందూ, ముస్లింలు శాంతియుత ర్యాలీని నిర్వహించారు. క్రిస్టియన్ పాలెంలో చర్చి దగ్గర నుండి కలెక్టరేట్ వరకుఈ ర్యాలీ కొనసాగింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సంఘీభావం తెలిపారు. గడియార స్తంభం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ మతోన్మాదంతో ముస్లింలు, క్రైస్తవులు, దళితులు, గిరిజనులపై దాడుల చేస్తూ దుర్మార్గమైన మారణకాండకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్ రాష్ట్రంలో హింస కాండకు వ్యతిరేకంగా చేపట్టే నిరసనలకు వైసిపి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. మణిపూర్ లో జరిగిన ఘటనలు దేశంలో ఎక్కడా జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవా లన్నారు.

ప్రజాశక్తి-నాదెండ్ల: మణిపూర్ సంఘటనకు నిరసనగా మండల కేంద్రమైన నాదెండ్లలో శాంతి ర్యాలీ నిర్వహించారు. యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నరసరావుపేటలో ..

నాదెండ్లలో.. .

సిజిజిబి వార్షిక నివేదికను ఆవిష్కరించిన సిఎస్

ప్రజాశక్తి-గుంటూరు

నివేదిక ఆవిష్కరిస్తున్న చీఫ్ సెక్రెటరీతో, బ్యాంకు చైర్మన్, ఇతర అధికారులు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 2022-23 వార్షిక నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవ హర్‌రెడ్డి సోమవారం తన ఛాంబర్‌లో బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు, ఇతర ఉన్న తాధికారుల సమక్షంలో ఆవిష్కరిం చారు. 8 జిల్లాల్లో 249 శాఖలతో 27 లక్షల మంది ఖాతాదారులకు గణనీయమైన సేవలం దిస్తూ గత ఆర్థిక సంవత్సరానికి రూ.17,582 కోట్ల వ్యాపారంతో అత్యుత్తమ ఫలితాలు సాధించి నందుకు బ్యాంకు అధికారులు, ఉద్యో గులకు జవహర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అంతే కాకుండా కస్టమర్ల సౌకర్యం కోసం మొబైల్ బ్యాంకింగ్ సేవలను మరింత సులభ తరంగా అందించేందుకు సిజిజిబి మనీ 2.0 యాప్‌ను ఆవిష్కరించటం శుభపరిణామం అని అన్నారు. బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ బ్యాంకు కన బరిచిన ఈ ఫలితాలు ఖాతా దారులకు మా పనితీరుపై ఉన్న నమ్మకానికి నిదర్శనం అని, బ్యాంకు సిబ్బంది అంకిత భావానికి అద్దం పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్లు డాక్టర్ బి.వి.రమణ, పి.మారుతీరామ్, గుం టూరు రీజనల్ మేనేజర్ పి.వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

బైక్ రేసింగ్ కేసులో నలుగురు యువకుల అరెస్టు

ప్రజాశక్తి - తుళ్లూరు

పోటీలు పెట్టుకొని మరీ ద్విచక్ర వాహనాలను ఇష్టారీతిన,ప్రమాద కారంగా నడుపుతున్న కొంతమంది యువకులను పోలీసులు సోమ వారం అరెస్టు చేశారు.వారి వద్ద వాహనాలను స్వాధీనం చేసు కున్నట్లు డిఎస్పీ వి పోతు రాజు తెలిపారు. రాజధాని లోని దొండ పాడు - రాయపూడి మధ్య సీడ్ యాక్సెస్ రోడ్డుపై వాహ నాలను అతివేగంగా నడు పుతూ ఇతర వాహనదారు లను ఇబ్బందులకు, భయాందోళ నలకు గురి చేసేలా విన్యాసాలు చేసిన కేసుకు సంబం ధించి మంగళగిరి మండలం ఎర్ర బాలెంకు చెందిన పులిగుజ్జు వంశీ (మంగళగిరి మండలం ఎర్ర బాలెం) ఎం కిరణ్ (భద్రాచలం - తెలం గాణ) శానం దిలీప్ (తుళ్లూరు మండలం అనంతవరం) ముత్యాలు సాయి దుర్గేష్ (చిలక లూరి పేట) లను అరెస్టు చేశామని చెప్పారు. మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. తల్లీ దండ్రులు కూడా తమ బిడ్డలను గమనిస్తూ తగు జాగ్రత్తలు తీసు కోవాలని డిఎస్పి సూచించారు.

ఇనుము చోరీ పై కేసు నమోదు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని లోని ఐనవోలు గ్రామం వద్ద ముళ్ళ కం చెల్లో పాత ఇనుమును దొంగి లించి ఆటోలో తరలిస్తున్న బొజ్జగాని రేణుక మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ ఆనందరావు సోమవారం తెలిపారు.వారి వద్ద నుంచి 100 కేజీల ఇనుము,ఆటోను స్వాధీనం చేసుకున్నామని, వారితో పాటు ఆటో డ్రైవర్ అరివేణి నాగరాజును అరెస్టు చేసినట్లు చెప్పారు.

కోడిపందేల నిర్వహకుడి అరెస్ట్

ప్రజాశక్తి - తుళ్లూరు

కోడిపందేలు నిర్వహించడంతో పాటు గుంటూ రుకు చెందిన నన్నెబోయిన బాజీ అనే వ్యక్తిని కొట్టినం దుకు అబ్బూరి లీలా ప్రసాద్,మరికొందరిపై కేసు నమోదు చేశామని సిఐ ఆనందరావు సోమవారం తెలిపారు. కోడిపందేలు,పేకాట నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

ప్రజాశక్తి -అమరావతి

అమరావతి గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేకంగా గుడ్ షెఫర్డ్ సిస్టర్ కాన్వెంట్ నుండి అమరావతి అమరలింగేశ్వర దేవస్థానం వరకు భారీ ర్యాలీ సోమవారం నిర్వహించారు. కార్య్ర కమంలో సిఐ బ్రహ్మం, నిమ్మ విజయసాగర్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని జండా ఊపి మానవ అక్రమ రవాణా ర్యాలీని ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ నాగేంద్రం, ఎస్ఐ సుభాని మాట్లా డుతూ ప్రతి ఒక్కరు అక్రమ రవాణాన్ని వ్యతిరేకించి మహి ళలపై బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు హింసలను ఖండించాలన్నారు. ర్యాలీలో ఉపసర్పంచ్ నిమ్మ విజయ సాగర్ బాబు గుడ్ షెఫర్డ్ డైరెక్టర్ సిస్టర్ విన్నారాసి, సిస్టర్ డియానా తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 31,875
మిర్చి ఎగుమతి	: 30,259
మిర్చి నిల్వ	: 9,908

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,500 - 23,000
నెం.5	9,500 - 20,500
273	15,500 - 21,000
341	11,700 - 21,000
4884	12,500 - 12,500
సూపర్10	18,000 - 20,000
	నాన్ ఎసి
తేజ	9,000 - 23,000
బడిగి	13,500 - 26,500
దేవనూరు డీలక్స్	14,700 - 21,000
తాలుకాయలు	5,000 -14,000
	ఎసి
334	11,500 - 20,000
నెం.5	12,000 - 12,000
341	13,500 - 19,500
4884	18,000 - 18,000
తేజ	12,000 - 23,000
బడిగి	12,500 - 26,000
దేవనూరు డీలక్స్	19,000 -19,000
తాలుకాయలు	5,000 -13,000

స్వల్ప వాదోపవాదాలతో ముగిసిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం కౌన్సిల్ హాల్‌లో చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షతన నిర్వహిం చారు. అజెండాలోని మొదటి అంశం చద వడం పూర్తికాగానే టిడిపి కౌన్సిలర్ దేసు యుగంధర్ తన వార్డులో కల్వర్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికి పనులు ప్రారం భం కాలేదన్నారు. పురపాలక సంఘ కార్యా లయంలో అధికారుల గదులకు మాత్రం ఎప్పటికప్పుడు ఆధునీకరణ జరుగుతోందని, ప్రజా సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఎం.జస్వంత్ రావు.. ఏఈల గదులకు గ్లాస్ ఏర్పాటు చేశారని, ఆది కూడా లక్షరూపాయల లోపే ఉంటుందని బదులిచ్చారు. ఇందుకు సంతృప్తి చెందని యుగంధర్ అధికారులపై మరికొన్ని విమర్శలు చేశారు. ఈ విమర్శలను వైసిపి కౌన్సిలర్లు తీవ్రంగా ప్రతి ఘటించారు. టిడిపి కౌన్సిలర్ అన్నం పిన్నారావు మాట్లాడుతూ సచి వాలయంలో పనిచేసే ఉద్యోగులు కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, వాలంటరీ వ్యవస్థ వచ్చిన తర్వాత పరిస్థితి దారుణంగా తయారైందని ఆరోపించారు. ఇదే విషయమై టిడిపి కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి కూడా విమర్శలు చేశారు. వెంటనే జోక్యం చేసుకున్న వైసిపి కౌన్సిలర్‌లు, వాలంటీర్ల సేవలను గుర్తించాలని ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులకు సూచించారు. సంక్షేమాన్ని అందించే విష యంలో వారు ముందుంటున్నారని, గత ప్రభు త్వం మాదిరిగా పార్టీ నాయకులతో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి, వారు చెప్పిన వారికి ప్రభుత్వ పథకాలు అందించటం లేదనే విష యాన్ని గమనించాలని కోరారు. దీంతో వైసిపి, టీడీపీ కౌన్సిలర్‌ల మధ్య వాగ్వావాదం చోటు చేసుకోవడంతో సమావేశాన్ని అయిదు నిమి షాలు చైర్‌పర్సన్ వాయిదా వేశారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికి అజెండాలో అంశాలు చదివి ఆమోదించినట్లు చైర్ పర్సన్ ప్రకటించారు. అయితే 15వ అంశంపై టీడీపీ కౌన్సిలర్‌లు డిసెంట్ ఇచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, డీఈ నాగభూషణం, అసిస్టెంట్ కమిషనర్ అనూష, కౌన్సిలర్‌లు, కో అప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరుజిల్లా, తాడికొండ మండలం, పొన్నెకల్లు గ్రామానికి చెందిన మస్తాన్ రెడ్డి ఏరువా కి చెందిన పాస్ పోర్టు పోయినది. హైదరాబాద్ రీజనల్ పాస్పోర్టు కార్యాలయం జారీ చేసిన G2414614 HYD Z50197707 నెంబర్ గల పాస్ పోర్టు 29-7-2023 వ తేదీన పొన్నెకల్లు నుండి గుంటూరు కు ఆటోలో వెళు తుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియపరచగలరు.

మస్తాన్ రెడ్డి ఏరువా
పొన్నెకల్లు గ్రామం
తాడికొండ మండలం
గుంటూరు జిల్లా
7411908129

మహారాజశ్రీ గుంటూరు మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 158/2016

కోలా శ్రీనివాసు
కోలా మల్లికార్జునరావు ...వాదులు
మరియు
జొజగిరి మేరీ రాజేశ్వరి మరియు ఇతరులు ...ప్రతివాదులు

టు
6వ ప్రతివాది కి నోటీసు
ఏలూరి నరశింహారావు, తండ్రి సీతారామయ్య, ప్లాట్ నెం.5, బి.బ్లాక్, ప్రగతి అపార్ట్‌మెంట్, 5/2 చంద్రమౌళి నగర్, గుంటూరు.

ఈ నెంబరు దావాను వాదులు పార్టిషన్ నిమిత్తం ప్రతివాదులపై దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో శ్రీ కోర్టువారు 6వ ప్రతివాదికి పేపరు ప్రకటన ద్వారా దావా నోటిసు నిమిత్తం ది.31-08-2023నకు వాయిదా వేసి ఉన్నారు. కావున తెలియజేయటమైనది. కనుక వాయిదా నాడు 6వ ప్రతివాది పై కోర్టు వారి ఎదుట ఉదయం 10-30 నిమిషములకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

ఏ.ఆర్.శ్రీనివాస మూర్తి,
వాది తరుపు అడ్వకేట్,
కృష్ణ నగర్, 2వ లైను,
గుంటూరు-6,
సెల్.నెం.8019326548.

అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

కలెక్టరేట్‌లో 185 ఫిర్యాదులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజా సమస్యలను పరిష్కరించడమే అధికారుల లక్ష్యమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'లో ప్రజల నుండి 185 ఫిర్యాదులను జెసితోపాటు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పల్నాడు అభివృద్ధి మండలి వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి స్వీకరించారు. అర్జిదార్లకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భోజనాన్ని ఏర్పాటు చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై వినతి

వినతి పత్రం ఇస్తున్న శివకుమారి తదితరులు

పెరిగిన కూరగాయల ధరలతో మధ్యాహ్న భోజన కార్మికులు అవస్థలు పడుతున్నారని, మెనూ ప్రకారం వంట చేయడానికి ప్రభుత్వం ఇచ్చే డబ్బులు చాలడం లేదని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి అన్నారు. ఈ మేరకు జెసికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. కూరగాయలు, గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలు నిరంతరం పెరగడంతో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడం కష్టంగా మారిందన్నారు. 2019లో నిర్ణయించిన గౌరవ వేతనాలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారన్నారు. వర్కర్లకు రూ.10 వేలు వేతనం, ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ చార్జీల పెంచాలని కోరారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు, పథకం అమలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కలించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం, 6 నెలలకు 2 కాటన్ చీరలు, గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

మణిపూర్ అల్లర్లపై ఫిర్యాదు

మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నరసరావుపేట పట్టణానికి చెందిన పలువురు క్రైస్తవ సంఘాలు ర్యాలీగా వచ్చి జెసికి వినతిపత్రం ఇచ్చారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

చంపుతానని బెదిరింపులు

డబ్బూరి లక్ష్మయ్య, కోట్ల శివశంకరరెడ్డి అనే ఇద్దరికి భూ వివాదం ఉండగా తాను లక్ష్మయ్యకు మద్దతిస్తున్నాననే అనుమానంతో శివశంకరరెడ్డి తనపై దాడి చేశాడని ముప్పాళ్ల మండలం దమ్మాలపాడుకు చెందిన కుంకలగుంట షేక్ ముస్తఫా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తనను చంపుతానని శివశంకరరెడ్డి బహిరంగంగానే హెచ్చరిస్తున్నాడని వాపోయారు. తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం వినతి

తమ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలేనికి చెందిన రుద్రపాటి చెన్నకేశవులు, నాగమల్లేశ్వరరావు, సుమంత విన్నవించారు. విగ్రహ స్థలం విషయంలో వివాదం తలెత్తగా పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పరిష్కరించి మరో స్థలాన్ని ఎంపిక చేశారని, ఆ స్థలంలో కట్టిన విగ్రహ దిమ్మెను ఎవరో ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు.

ప్రాణాలకు తెగించి సేవలు.. సరిగా దక్కని జీతాలు..

- కలెక్టరేట్ ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ధర్నా
- పిఆర్‌సి అమలు, కారుణ్య నియామకాలు, ఇతర సమస్యలపై జెసికి వినతి
- ప్రభుత్వం స్పందించకుంటే 10 తర్వాత ఎప్పుడైనా సమ్మె

సత్రశాల వద్ద గల నాగార్జునసాగర్ టైల్‌పాండ్‌లో నిరసన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విద్యుత్ సంస్థల వేతన సవరణ, కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తొలుత ధర్నా చౌక్ వద్ద నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు విధి నిర్వహణ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్నా ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. 2018 పీఆర్సీ గడువు ముగిసి 15 నెలలైనా కొత్త వేతన ఒప్పందాలకు యాజమాన్యం సిద్ధపడడం లేదన్నారు. తెలంగాణలో విద్యుత్ ఉద్యోగుల కంటే ఆంధ్రప్రదేశ్‌లో 30 శాతం వరకు తక్కువగా వేతనాలున్నాయని తెలిపారు. తెలంగాణలో కాంట్రాక్ట్ స్కిల్ కార్మికులకు నెలకు రూ.43,162 ఇస్తుంటే ఇక్కడ మాత్రం రూ.20,598 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేస్తూ.. తాము అధికారంలోకి రాగానే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జెఎల్‌ఎం గ్రేడ్-2లు ప్రాణాలు పణంగా పెట్టి పని చేశారని, మరణించిన వారి స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టడం లేదని, వీరి కుటుంబానికి వైద్య సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉద్యోగులు, కార్మికుల జీతాల కోసమే ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే 10 తర్వాత మెరుపు సమ్మెకు ఉద్యోగులు, కార్మికుల సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం జెసి శ్యాంప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, అధ్యక్షులు జె.రాజశేఖర్, విద్యుత్ పర్మినెంట్ ఉద్యోగ సంఘ నాయకులు ఎం.సుబ్బారెడ్డి, ఇతర నాయకులు బాలకృష్ణ, కె.శ్రీను, రాజశేఖర్, మురళి, కరీముల్లా, గిరి, బాష, రాజేష్, శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ధర్నాకు శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు పట్టణ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు యు.రంగయ్య, సంఘీభావం తెలిపారు.

కుడి జల విద్యుత్ కేంద్రం వద్ద

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద గల నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులు సోమవారం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన కొనసాగించారు. అల్లూరి సీతారామరాజు మహాత్మా గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను అందజేశారు. జెఎసి చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. సెక్రెటరీ మల్లేష్, సుబ్బారావు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రం వద్ద ఏపీ జెన్కో ఉద్యోగులు ఆందోళనలు సోమవారమూ కొనసాగాయి. జెన్కో ఏడీఈ రాజారెడ్డి మాట్లాడుతూ ఈపీఎఫ్‌ను జిపిఎఫ్‌గా మార్చాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను, గ్రేడ్-2 జెఎల్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, మృతిచెందిన గ్రేడ్-2 జెఎల్‌ఎంల ఉద్యోగుల స్థానంలో వారి కుటుంబీకులను నియమించాలని డిమాండ్ చేశారు. అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎడిఇలు అక్బర్, మోహన్‌బాబు, రమణ, ఏఈలు వెంకటేశ్వర్లు, రేవతి, అనిత, ఉద్యోగులు బి.సూరజ్‌చంద్, వెంకటేష్, రామకృష్ణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆస్తి కోసం కొడుతున్నారు..

అర్జిదార్ల సమస్యలు వింటున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రజా సంక్షేమానికీ పోలీసులు కృషి చేయాలని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'లో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జిదార్లకు భోజన సదుపాయం కోసం దాతల సహకారంతో నిర్మించిన భోజనశాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో కలిసి ఎస్పీ ప్రారంభించారు. నరసరావుపేట పట్టణానికి చెందిన సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెపి రంగారరావు భోజనాన్ని సమకూర్చగా ఎస్పీ, ఎమ్మెల్యేలతో, కార్యక్రమం ఆర్గనైజర్స్ బచ్చు వెంకట సత్యనారాయణ వడ్డించారు. ఎఎస్పీలు ఆర్.రాఘవేంద్ర, డి.రామచంద్రరాజు, ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి మహేష్, పి.రాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం వ్యాపారి రూ.6.87 లక్షల మోసం

వ్యాపార లావాదేవీల క్రమంలో పరిచయమైన క్రోసూరుకు చెందిన తమ్మెంద్రు నాగేశ్వరరావు బియ్యం పంపిస్తానని చెప్పగా 400 క్వింటాళ్ల బియ్యాన్ని క్వింటాళ్ రూ.3800 చొప్పున రూ 5.37 లక్షలు ఆన్లైన్ ద్వారా రూ.1.50 లక్షలు మొత్తం 6.87 లక్షలు పెద్దల సమక్షంలో గతనెల (జులై) 16న ఇచ్చానని, అయితే బియ్యం పంపించకుండా కాలయాపన చేయడమే కాకుండా దుర్భాషలా డుతున్నాడని వినుకొండ పట్టణానికి చెందిన కిరాణా దుకాణదారుడు, వికలాంగుడు అయినా ఆత్మకూరి ప్రభాకరరావు ఫిర్యాదు చేశారు. బియ్యాన్ని పంపబోనని, ఏం చేసుకుంటావో చేసుకో.. అని బెదిరిస్తున్నాడని, నాగేశ్వరరావు తనకు నుండి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు.

పొలాన్ని కాజేశారని శతాధిక వృద్ధురాలు ఫిర్యాదు

మండల కేంద్రమైన నకరికల్లులోని 414/2 సర్వే నంబర్‌లో ఎకరం పొలాన్ని రూ.5 లక్షలకు రావిపాడుకు చెందిన ఆముదాల శ్రీను కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నామని, ఒప్పందం రోజున రూ.1.05 లక్షలు చెల్లించారని, రిజిస్ట్రేషన్ రోజు తన బంధువులను ఎవర్నీ రానివ్వకుండా చేసి రిజిస్ట్రేషన్ తరవాత మిగిలిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రావిపాడుకు చెందిన శాతాధిక వృద్ధురాలు మేడా రాములమ్మ ఫిర్యాదు చేశారు.

వృద్ధులమైనా డబ్బు కోసం కొడుతున్నారు

తన కుమారుడు 18 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా కుమారుడు వాటా ఆస్తిని కొంత నగదు ఇచ్చామని, వైకల్యం, వృద్ధాప్యం కారణంగా కుమార్తెను తమ వద్దే సాయంగా పెట్టుకున్నామని, తమ వాటా ఆస్తిని కుమార్తెకు వీలునామా రాయగా 2019 నుండి తన కోడలు, మనమరాలు ఇంకా ఆస్తి, డబ్బు కోసం ఇబ్బంది పెడుతున్నారని రొంపిచర్ల మండలం విప్పర్లకు చెందిన వృద్ధురాలు పేరుపోగు నాగరత్నమ్మ ఫిర్యాదు చేశారు. రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని పిలిపించి మాట్లాడారని, అయినా వృద్ధులమని కూడా చూడకుండా రెండ్రోజుల కిందట ఇంటికి వచ్చి కొట్టారని చెప్పారు.

భర్త కోలుకోలేదు.. సాయం చేయండి..

తన భర్త సాగర్ ఆటో నడుపుతూ ఉంటాడని, రెండు నెలల కిందట పిడుగురాళ్ల నుండి వినుకొండ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు తన భర్త ఆటోను ఢీ కొట్టడంతో ఆటో నుజ్జు నుజ్జు కాగా భర్త తీవ్రంగా గాయప డ్డారని ఈపూరు మండలం కొండ్రముట్లవారిపాలేనికి చెందిన రొక్కరొక్కల ఝాన్సీ ఫిర్యాదు చేశారు. తన భర్తకు వినుకొండ, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా కోలుకోకపో వడంతో రూ.లక్షలు అప్పులు చేసి చికిత్స చేయించామని, అయినా కోలుకోడానికి సమయం పడుతుందని వైద్యులు చెప్పారని తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకొని తమకు ఆర్థిక సాయం దక్కేలా చూడాలని వేడుకున్నారు.

అర్జిదార్లకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ తదితరులు

పంచాయతీలను కాపాడండి

మాజీ ఐఎఎస్ అధికారి టి.గోపాలరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(జి)ద్వారా సంక్రమించిన రాజ్యాంగ ప్రతిపత్తి గల పంచాయతీలను కాపాడాలని మాజీ ఐఎఎస్ అధికారి టి.గోపాలరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రామన్నపేటలో గల జన చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయ హాలులో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీల స్థితి కడు దయనియంగా ఉందని నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని గోపాలరావు ఆవేదన వ్యక్తం చేశారు.గత 20 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న విద్యుత్ బకాయిల పేరుతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 14 మరియు 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ అకౌంట్స్ లో జమ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజల సొమ్ముతో అధికార పార్టీ కార్యకర్తలను వాలంటీర్లుగా 2.4 లక్షల మందిని నియమించుకొని పంచాయతీలకు సమాంతర వ్యవస్థను తీసుకొచ్చారని ప్రశ్నించారు. వాలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ, ఇతర శాఖలు కూడా గ్రామ సర్పంచ్‌ల నేతత్వంలోనే పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన తలసరి గ్రాంట్ కూడా సకాలంలో అందడం లేదని, గత 30 సంవత్సరాలుగా తలసరి గ్రాంట్ ఎనిమిది రూపాయలు గానే కొనసాగుతుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలన్నారు. 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించిన 29 అంశాలను సంపూర్ణంగా రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు బదిలీ చేయడం ద్వారానే 'జాతిపిత' గాంధీజీ పిలుపునిచ్చిన గ్రామ స్వరాజ్ సాధ్యమౌతుం దన్నారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయ్యూరు అప్పిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మబ్బు శిరీషా సుధాకర్, సుబ్బారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

10న నులిపురుగుల నివారణ దినం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి ఇతర అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఆగష్టు 10వ తేదీన జిల్లాలో 1 నుండి 19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు పంపిణీకి వైద్యఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పంచాయితీరాజ్, మున్సిపల్, ఐసీడీఎస్ అధికారులు సమన్వయంతో ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రూపొందించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనతకు, ఎదుగుదలపై ప్రభావం చూపుతున్న నులిపురుగుల నివారణకు ప్రతి ఏటా జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,73,291 మంది పిల్లలు, ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఒకేషనల్, పారామెడికల్ కళాశాలల్లో 3,18,031 మంది, మొత్తం 5,91,322 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఆగష్టు 10వ తేదీన అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఎవరైనా మిగిలిపోతే వారికి ఆగష్టు 17న పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ శ్రావణబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ జయరామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్ ఓవరాల్ ఛాంప్ గుంటూరు

పోటీల్లో పాల్గొన్న జిల్లా జట్టు

ప్రజాశక్తి-గుంటూరు

కర్నూలు, గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి రోప్‌స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ నిలిచారని జిల్లా రోప్ స్కిప్పింగ్ సెక్రెటరీ పి.తిరుపతిరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరు జిల్లా 11 బంగారు పతకాలు, 10 సిల్వర్, 8 బ్రాంజ్ మెడల్స్‌తో ఓవరాల్ ఛాంపియన్ సాధించింది. సోమవారం ఆయా విద్యార్థులను తిరుపతిరావు, కోచ్ స్వాతి, టిమ్ మేనేజర్ సురేష్ తదితరులు అభినందించారు.

మెగా స్కిప్పర్స్ జట్టు ప్రతిభ..

ఈ పోటీల్లో మెగా స్కిప్పర్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కోచ్ మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు.బాలికల విభాగంలో హర్షిణి, అక్షిత బంగారు పతకాలు సాధించారన్నారు. అలాగే బాలుర విభాగంలో సాగర్‌బాబు, సైదాబాబు, పేతురు, మాస్ సుమంత్‌రెడ్డి, శివకుమార్, నికిల్ మెడల్స్ సాధించారన్నారు.

7, 8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎల ధర్నా

అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

విఆర్‌ఎల సమస్యలపై ఈనెల 7, 8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే బాజీబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పాతగుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా బాజీబాబు మాట్లాడుతూ విఆర్‌ఎల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించకుండా తక్షణమే ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. తెలంగాణలో మాదిరిగానే విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న విఆర్‌ఎలకు వీఆర్వోగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలుగా పని చేస్తున్న విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రెండ్రోజుల ధర్నా జయప్రదం చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న ధర్నా శిబిరం వద్దకు వచ్చి సాక్షాత్తూ జగన్మోహన్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి, మన ప్రభుత్వం వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నాలుగేళ్లు పూర్తి అయినా హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన డిఏ కూడా తిరిగి రికవరీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాలో విఆర్‌ఎలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ పోరాడందే హక్కులు సాధించుకోలేమని అన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సంగయ్య, ప్రధాన కార్యదర్శి షేక్.నాగుల్‌మీరా, ఉపాధ్యక్షులు, జాలారాజేష్, సాంబశివరావు తదితరులు మాట్లాడారు.

నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెండింగ్ కేసుల అంశంపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులతో ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ సోమవారం సమావేశం నిర్వహించారు. వివిధ నేరాలకు కోర్టులలో శిక్షల శాతం పెరిగేలా పోలీస్ అధికారులు పిపి లు కషి చేయాలని సూచించారు. పోలీసు అధికారులు, పిపిలు సమన్వయంతో పనిచేయాలన్నారు. న్యాయశాఖకు ఆ చట్టంలోని ప్రతి ఒక్క సెక్షన్ గురించి పూర్తి అవగాహన ఉంటుందన్నారు. ఇరువురు సమన్వయంతో పని చేస్తూ వారి సందేహాలను నివృతి చేసుకుంటూ ముందుకు వెళితే బాధితులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు. పోలీస్ అధికారులు నిరంతరం పెండింగ్ లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలిస్తూ, ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డిసిఆర్బి డి ఎస్ పి శ్రీనివాస్ రావు, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శిరాజుద్ధన్ తదితరులుపాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన మన్నవ మోహనకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రకాశం జిల్లాలోని దర్శి నియోజకవర్గంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌ను టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, ఎన్‌టిఆర్ ట్రస్ట్ డైరెక్టర్ మన్నవ మోహనకృష్ణ సోమ వారం కలిశారు. పాదయాత్ర ప్రకా శం జిల్లాలో విజయవంతంగా పూర్తి చేసుకొని గుంటూరులో అడుగు పెడుతున్న సందర్భంగా లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యువగళం యాత్రతో గుంటూరు జిల్లా పసుపు మయంగా మారి, జనసునామీ సృష్టిస్తుందని అన్నారు.

డాక్టర్ శ్రీగౌరికి రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం న్యాయ పరిశోధన, న్యాయ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. శ్రీగౌరిని వీసీ రాజశేఖర్ సోమవారం అభినందించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కాలర్స్, బెంగళూరు వారు కె. శ్రీగౌరి రీసెర్చ్ పేపర్ 'ట్రేడ్ యూనియన్స్ రోల్ ఇన్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్' కు రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు 2023 పురస్కారంని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి అభినందించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య పి.రాజశేఖర్ శ్రీగౌరీని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్దయ్య, ఆచార్య సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ కష్ణారావు తదితరులు పాల్గొన్నారు. న్యాయ పరిశోధన,న్యాయ విభాగం విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు , సిబ్బంది శ్రీగౌరీని అభినందించారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు, ప్రభుత్వ సంస్థలకు సకాలంలో రేషన్ సరుకులతో పాటు ఆహార పదార్థాల వస్తువుల కిట్ లను సకాలంలో ఎమ్డీయ్ వాహనాల ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. నరసరావుపేట పట్టణంలోని ఎం.ఎల్.ఎస్ పాయింట్ ను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాములో ఉన్న బియ్యం, కందిపప్పు, చక్కెర, ఇతర ఆహార పదార్థాల వస్తువుల కిట్ లను రికార్డుల ప్రకారం ఉన్నవా లేదా అనే తేడాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో రేషన్ పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా, చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. గోదాములో ఉన్న ఇన్చార్జ్ అధికారి కి రేషన్ వస్తువుల పంపిణీ విషయంలో తలెత్తుతున్న సమస్యలపై, నియంత్రణ దిశ గా చర్యలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. తనిఖీలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి పద్మశ్రీ, జిల్లా మార్కెటింగ్ శాఖ మేనేజర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలు అంకితభావంతో వ్యవహరించాలి

డాక్టర్ వైఎస్ ఆర్ ఆరోగ్య శ్రీ పథకం లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు అంకితభావంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. ఆరోగ్య మిత్రలను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను అందిస్తోందని అన్నారు. అందులో భాగంగా జూన్-2023 నెలకు గాను సేవ మిత్రా అవార్డుకు సత్తెనపల్లిలోని డాక్టర్. వైఎస్ఆర్ మెమోరియల్ గజ్జల హాస్పిటల్ లో పని చేస్తున్న ఆరోగ్య మిత్ర గోలి లక్ష్మి వెంకట సజన, ఎంపికయ్యారు. స్థానిక కలెక్టోరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును, రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీల పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రశంశా పత్రం అందజేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ

సమగ్ర సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఇంటింటికి ఓటర్ల జాబితా సమగ్ర సర్వేని పారదర్శకంగా నిర్వహించాలని రాజకీయ పార్టీల నాయకులు ఆర్డీఓ కు విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ బిఎల్ఎన్ రాజకుమారి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పోలింగ్‌కేంద్రాల కన్వీనర్ల పేర్లు ఇవ్వాలని నాయకులకు సూచించారు. బిఎల్ఓ లకు రాజకీయ పార్టీలు నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 0 డోర్ నెంబరు పై గుర్తించిన ఓటర్ల వివరాలు వెల్లడించాలని ఆర్డీఓ ను కోరారు. పోలింగ్ బూత్ లలో ఎన్ని ఓట్లు తొలగించారు , ఎన్ని ఓట్లు నమోదు చేశారు తదితర వివరాలను ఆ బూతు పరిధిలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లు సర్వే చేయడం వలన ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం వుందని జనసేన నాయకులు ఆర్డీఓ కు వివరించారు. కొన్ని చోట్ల వాలంటీర్లు సర్వేలో పాల్గొంటున్నారని నాయకులు ఆర్డీఓ కు ఫిర్యాదు చేశారు. వాలంటీర్ల ప్రమేయం ఎక్కడా లేదని ఒకవేళ వాలంటీర్లు సర్వేలో పాల్గొంటే తక్షణం సస్పెండ్ చేస్తామని అన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ టిడిపి నాయకులు చౌటా శ్రీనివాసరావు ఆళ్ళ సాంబయ్య మక్కపాటి రామచంద్రరావు సీపీఐ నాయకులు ఇర్మియా జనసేన నాయకులు కె.సాంబశివరావు , రాజశేఖర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు టిఆర్కే మూర్తి, బిఎస్పీ నాయకులు బి.కిషోర్ బాబు పాల్గొన్నారు.

గొరిజవోలులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని గొరిజవోలులో ఆదివారం రాత్రి జంగం బాజి, అంబేద్కర్ యువజన సంఘం, గ్రామపెద్దల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ హాజరయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గ మిషన్ అంబేద్కర్ గ్రూప్ సభ్యులు నల్లపు కోటేశ్వరరావు, ఎడ్ల సురేష్, కొప్పుల బాబురావు, వాసీమళ్ల మాణిక్యరావు, చేకూరి డేవిడ్, రవి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయ సంఘ స్టేట్ కౌన్సిలర్‌గా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ స్టేట్ కౌన్సిలర్‌గా పల్నాడు జిల్లా నుండి పెదకూరపాడు మండలం 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయలు అన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సందర్భంగా సోమవారం పలువురు ప్రధానోపాధ్యాయలు, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి. శ్రీనివాస రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య,ఇతర ప్రముఖులు అభినందించారు.

నార్నెపాడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ నిర్లక్ష్య వైఖరి తగదు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

నార్నెపాడు గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ గ్రామంలోని ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నార్నెపాడు గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి నూకారపు సాంబశివరావు ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సమయపాలన లేకుండా కార్యాలయానికి రావడమే కాకుండా సేవలు కోసం వెళితే జవాబుదారీగా లేకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, కనీసం సచివాలయ సేవలు అందించడం లేదని అన్నారు. సదరు ఉద్యోగిని వ్యవహారశైలితో గ్రామంలోని ప్రజలు వివిధ సేవల నిమిత్తం సచివాలయానికి వెళ్ళాలంటే ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ విషయమై తక్షణమే మండలాధికారులు స్పందించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మీతులసి సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా కౌన్సిల్ సమావేశంలో అజెండలోని అంశాలను ప్రకటించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు షేక్ నాగుల్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్ కమిషనర్ కె.షమ్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

'రాష్ట్రాన్ని దోచుకుంటున్న జగన్ రెడ్డి'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని సత్తెనపల్లి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం కందుల వారి పాలెంలో సోమవారం నిర్వహించిన భవిష్యత్తుకు భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ఎన్టీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజక వర్గంలో మంత్రి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. పోలీసుల సహకారంతో పాలను చేస్తున్నారన్నారు ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు గ్రామంలోని అన్ని వీధుల్లో మహిళలు పార్టీ నేతలు పార్టీకార్యకర్తలు తిరిగి మహిళా శక్తి కర పత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.మల్లారెడ్డి పి.వెంకటరెడ్డి,పి.శ్రీనివాస్ రెడ్డి జెట్టి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో వైవీ తనయుడు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

లోకేష్ పాదయాత్ర లో పాల్గొన్న వైవీ సుజిత్ కుమార్

సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు తనయుడు వైవీ సుజిత్ కుమార్ లోకేష్ యువగళం పాదయాత్ర లో పాల్గొన్నారు. అద్దంకి నియోజకవర్గంలో జరిగిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నార లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర లో సుజిత్ కుమార్ పాల్గొన్నారు.లోకేష్ తో కలిసి పాదయాత్ర చేశారు. అనంతరం లోకేష్ తో భేటీ అయ్యారు.

వికలాంగులకు త్రిచక్రవాహనాలు అందజేత

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వికలాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీ కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసిపోయి, పంపిణీ కూడా జరిగింది. అయితే, ఇటీవల ఇద్దరు వికలాంగులు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పెదకూరపాడు, మాచవరం మండలాలకు చెందిన మట్టపల్లి ప్రకాశరావు, సర్వేపల్లి సునీత లు తమకు త్రిచక్ర వాహనాలు ఇప్పించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇద్దరూ కలిసి జిల్లా వికలాంగుల సహకార సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్తను హైదరాబాద్ కు చెందిన వర్చు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఆ ఇద్దరు వికలాంగులకు త్రిచక్ర వాహనాలను వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వాహనాలను తెప్పించారు.

మానవత్వంతో స్పందించిన కంపెనీ ప్రతినిధులు సువార్త సూచనల మేరకు రూ .1.70 లక్షల విలువైన రెండు త్రిచక్ర వాహనాలను కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. త్రి చక్ర వాహనాలను అందుకున్న వికలాంగులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, కలెక్టర్ గత ఏడాది అక్టోబర్ నెలలో జిల్లా వ్యాప్తంగా 70 త్రిచక్ర వాహనాలను నియోజక వర్గానికి 10 చొప్పున ఉచితంగా ప్రభుత్వ సహకారంతో వికలాంగుల సంక్షేమ సహకార సంస్థ వారు అందించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల సహకార సంస్థ అసిస్టెంట్ డెరెక్టర్ సువార్త, నవోదయం నోడల్ అధికారి సంజీవ్ రావు, కలెక్టరేట్ ఏ.ఓ అనీల్ కుమార్, నరసరావుపేట తహశీల్దార్ రమణ నాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు అందజేస్తున్న కలెక్టర్

ఏపీ ఎన్జీవో గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏపీ ఎన్జీవోస్ కౌన్సిల్ సమావేశాలు ఆగస్టు 21,22 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సూరేపల్లి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో జరగబోయే ఈ మహాసభకు ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీం, సురేష్,రామలక్ష్మి,వెంకటకృష్ణ, అమతరావు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల: పట్టణ సమీపంలో రాయవరం జంక్షన్ దగ్గర సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బొల్లాపల్లి మండలం గండిగనమలకు చెందిన రమావత్ తులసి రామ్ నాయక్ ,బాణావతి ఉమామహేశ్వరరావు నాయక్, రమావత్ వెంక టేశ్వర్లు నాయకులు ద్విచక్ర వాహనంపై మాచర్ల వస్తుండగా ఆటో ఢీకొనడంతో గాయాలయ్యాయి. ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. వీరిలో వెంక టేశ్వరరావు నాయక్ గుంటూరులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యో గం చేస్తున్నాడు. అతన్ని మాచర్లలో బస్సు ఎక్కిం చేం దుకు గండి కనుమల నుండి వీరు ముగ్గురు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

దుగ్గిరాలలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ

మణిపూర్ ఘటనలపై నిరసన

ప్రజాశక్తి-దుగ్గిరాల

మణిపూర్‌లో ఘటనలను నిరిసిస్తూ మండల కేంద్రం దుగ్గిరాలలో సోమవారం శాంతి ర్యాలీని నిర్వహించారు. ముందుగా దళితవాడలోని లూథరన్ చర్చి వద్ద శాంతికి చిహ్నంగా పావురాలను ఎగురవేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. జడ్పిటిసి మేకతోటి అరుణ జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం తహశీల్దార్ కె.మల్లేశ్వరికి అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా దుగ్గిరాల మండలం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఉన్నం సురేష్‌బాబు మాట్లాడుతూ మణిపూర్‌లో ఘోరమైన సంఘటనలు జరుగుతున్నప్పటికీ కేంద్రం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం స్పందిం చడం లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

మణిపూర్ ఘటనలను చేబ్రోలు క్రైస్తవ సమాఖ్య, పాస్టర్స్ ఫెలోషిప్పులు, క్రైస్తవ సంఘాలు నిరసించాయి. తహశీల్దార్ , మండల మేజిస్ట్రేట్, కె వి గోపాలకృష్ణ, చేబ్రోలు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.ఆనంద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.బాబు రావుకు వినతిపత్రం అందజేశాయి.

మంగళగిరి టిడ్కో గృహ సముదాయవాసులు 'స్పందన'లో ఫిర్యాదు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి టిడ్కో గృహసముదాయ ప్రాంతంలో, నివాసాలకు పక్కనే అక్రమ చెత్త డంపింగ్, జంతు కళే బరాలు, మెడికల్ వ్యర్ధాల డంపింగ్ ను నిలుపుదల చేయిం చాలని కోరుతూ స్పందనలో ఫిర్యాదు చేశారు. పట్టణ టిడిపి అధ్యక్షులు దామర్లరాజు సోమవారం ఉదయం స్థానిక నివా సితులతో అర్జీ అందజేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గంధం, కాలుష్యంతో, స్థానికంగా నివాసం ఉం టున్న టిడ్కో గృహ సముదాయవాసులు ఇబ్బందులు పడుతున్నారని, దోమలు పెరిగి ప్రజలు పలు వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. అలాగే, టిడ్కో గృహ సము దాయ కూడలిలో స్పీడ్ బ్రేకర్లను వేయించాలని, ద్విచక్ర వాహనాలు అమిత వేగంతో ఇటీవల పలు ప్రమాదాలు సంభవించాయని, టిడ్కో గృహ ఈశాన్య భాగాన ఉన్న చెరువు ప్రమాదభరితంగా మారిందని మొదలైన సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. టిడిపి నాయకులు అబ్దుల్ మజీద్, వి.మాధవరావు, జి.రాఘవ, బి.శ్రీనివాసరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో సత్తా చాటిన నెహ్రూ నికేతన్ విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి

షేక్ సనాఫాతిమాకు మెడల్‌ను అందిస్తున్న మురళీకాంత్

ఒలంపియాడ్‌లో విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఆవరణలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం గత విద్యా సంవత్సరంలో న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ సైన్స్ ఒలంపియాడ్‌కి తమ పాంశాలకు చెందిన నాల్గవ తరగతి విద్యార్థిని షేక్ సనా ఫాతిమా హాజరై 91వ ర్యాంక్ సాధించిందని చెప్పారు. మరి కొంత మంది విద్యార్థులు కూడా ఒలంపియాడ్‌లో వారి సత్తా చాటారని అన్నారు. ఈ నేపథ్యంలో సిల్వర్ జోన్ ఫౌండేషన్ పంపిన సర్టిఫికెట్లు, గోల్డ్ మెడల్‌ను షేక్ సనా ఫాతిమాకు అందించారు.

పంట పొలాల్లో వర్షపునీటిని బయటకు పంపండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

అకాల వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీరు రోజులు గడుస్తున్నా బయటకు పోయే అవకాశం లేక చెరువులను తలపించేలా ఉన్నాయని, ఖరీఫ్ సీజన్ లో వరి సాగుకు అవకాశం ఉండదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం దుగ్గిరాల మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కి సోమవారం అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే రెండు సార్లు వరి విత్తనాలు వెద పెట్టారని, పల్లపు పొలాలు ముంపునకు గురై నష్టం వాటిల్లిందని అన్నారు. చిలువూరులో ఉత్తరం వైపు జగ నన్న కాలనీల పక్కన సుమారు 250 ఎకరాలకు పైగా పొలాల్లో నీరు నిలిచి పోయాయని చెప్పారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఇంకా నెల రోజులైనా పంట చేలు ఆరుదలకి రావని, ఖరీఫ్ సీజన్లో పంటలు వేసే అవకాశం ఉండదే మోనని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పెనుమూలి, మంచికలపూడి,తుమ్మపూడి గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి వర్షపు నీటిని బయటకు పంపే చర్యలు

తహశీల్దార్‌కి వినతిపత్రాసి ఇస్తున్న సిపిఎం దుగ్గిరాల మండల కమిటీ

తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ మల్లేశ్వరి డ్రైనేజీ జెఇ, ఇరిగేషన్ అధికారుల తో మాట్లాడారు. డిఆర్బిసి వాగు మాత్రం తమ పరిధిలో ఉందని, వచ్చి చూస్తామని చెప్పారు. అర్జీ ఇచ్చిన వారిలో సిపిఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వై .బ్రహ్మేశ్వరావు, బి.అమ్మిరెడ్డి,బి.చిరంజీవి పాల్గొన్నారు

పంచాయితి కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఎపి కౌలు రైతు సంఘం నాయకులు, రైతులు

ఊదర కాలువలో తూటికాడను తొలగించండి

మండలంలోని చిలువూరులో ఊదర కాలువలో అల్లుకుపోయిన తూటికాడ చెట్లను యుద్ధ ప్రతిపాదికన తొలగించాలని కోరుతూ కౌలు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, స్థానిక రైతులు కలిసి గ్రామ పంచాయితి కార్యదర్శి కె.లక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. వెంటనే పంచాయితి ఎఇ శ్రీనివాసరావుతో మాట్లాడారు. వారు వెంటనే నీరు బయటకు పోయే విధంగా చూస్తామని చెప్పారు. కౌలు రైతు సంఘం గ్రామ అధ్యక్షులు బి. కనకాంబరం, కె. దావీదు, కె.వెంకటేశ్వంరావు,ఎం.కోటేశ్వరరావు,ఎల్.శ్రీనివాసరావు, ఎన్.శేష్ కుమార్, ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాల పరిశీలన

ప్రజాశక్తి-తెనాలి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను సోమవారం వ్యవసాయ సహాయ సంచాకులు ఎన్.ఉషారాణి పరిశీలించారు. ఐతానగర్‌తో పాటు రూరల్ గ్రామం తేలప్రోలు పరిధిలో రైతులను కలిసి వారితో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ తెనాలి మండల పరిధిలో 17వేల ఎకరాల పై చిలుకు వరి సాగు ఉంటుందని, దానిలో రెండు వేల ఎకరాల్లో వెదవరి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారన్నారు. పది నుంచి 20 రోజుల దశలో ఉన్న వరి భారీ వర్షాలకు ముంపునకు గురికావడంతో రైతులు కొంత నిరాశలో ఉన్నట్లు చెప్పారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పడితే, బిపిటి

రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ ఉషారాణి

5204 వరిని రైతులు సాగు చేయొచ్చని, ప్రకృతి వైపరీత్యాల పట్ల రైతులు సంయమనం పాటించాలని అన్నారు. ఆర్బీకేలకు ఎరు వులు పుష్కలంగా అందుబాటులోకి వస్తాయని, విత్తనాలు కూడా అధీకృత డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్, విఎఎ కె.హర్దీష్ వర్మ, ఆల్ఫితేరు ఉన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- తాడేపల్లి/తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ వారికి, రేషన్ డీలర్లతో తాడేపల్లి తహశీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆగస్టు 1వ తేదీ జరగబోయే రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని, ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, క్రమశిక్షణ ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. రేషన్ మొబైల్ వ్యాన్ల వద్ద మాత్రమే రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్లు దుర్గారావు,సతీష్ పాల్గొన్నారు.

సమస్యలు మరోసారి వింటాను

రాజధాని రైతులతో అంబటి రాయుడు

ప్రజాశక్తి - తుళ్లూరు

మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సోమవారం రాజధాని ప్రాంతంలో పర్యటించారు. స్థానిక వైసిపి నాయకులతో కలిసి వెలగపూడిలో రైతుల దీక్షా శిబిరానికి సమీపంలో నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి గుడికి వెళ్లారు. కొంతమంది రైతులు ఆయనను కలిశారు. తాము రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చి రోడ్డున పడ్డామని, దీక్షా శిబిరంలోకి వచ్చి సమస్యలు వినాలని కోరారు. మరోసారి వింటానని రాయుడు అనడంతో, రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలు వినకపోయినా తమకు మద్దతు ఇవ్వాలని రైతులు కోరగా, మరోసారి వస్తానంటూ ఆయన అక్కడి నుంచి వెళ్ళిపోయారు. వెలగపూడితో పాటు ఐనవోలు, మందడం గ్రామాల్లో రాయుడు పర్యటించారు. ఐనవోలులో గ్రామ వైసిపి

వెలగపూడిలో అంబటి రాయుడుతో మాట్లాడుతున్న రైతులు

అధ్యక్షులు పాలకాయల శేషగిరి ఇంటిలో అల్పాహారం తీసుకొని కార్యకర్తలతో ఫోటోలు దిగారు. వెలగపూడిలో బి ఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందడం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విద్యా బోధన, కనీస సౌకర్యాలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. రాయుడును చూసేందుకు యువకులు ఆసక్తి కనబరిచారు. యువకుల కోరిక మేరకు కొద్ది సేపు క్రికెట్ ఆడారు.

బాధ్యతలు స్వీకరించిన పొన్నూరు అర్బన్ సిఐ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌కు నూతన సిఐగా మహమ్మద్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు నుంచి బదిలీపై వచ్చినట్లు ఆయన చెప్పారు. గతంలో ఇక్కడ పని చేసిన బాబి నెల్లూ రుకు బదిలీపై వెళ్లి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అల్తాఫ్ హుస్సేన్‌ను ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది అభినందించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉండవల్లిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయవాడ అమరావతి కంటి ఆసుపత్రి, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి అవ సరమైన కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. 40 మంది గర్భిణులకు ఉచితంగా న్యూట్రిషన్ ఫుడ్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు ఎస్.కేశవరావు, ఎస్. రామకృష్ణ, సుకుమార్‌రెడ్డి, గోపాలం సాంబశివరావు, కె.శివన్నారాయణ, రాజేష్, ఎల్.కిషోర్, తాడేపల్లి ఎంఇఒలు నాగేశ్వరరావు, శాంతకుమారి పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు వెంకయ్యకు నివాళి

ప్రజాశక్తి-తెనాలి

రంగస్థల కళా కారునిగా ఎంద రినో మెప్పించిన కళాకారుడు ఆకుల వెం కయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణానికి చెందిన ప్రముఖ రంగ స్థల పౌరాణిక కళాకారుడు వెంకయ్య వర్ధంతిని సోమవారం పలువురు కళాకారులు నిర్వహించారు. స్థానిక నందుల పేటలోని వెంకయ్య విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతామణి నాటకం ద్వారా రంగస్థలానికి పరిచయమైన వెంకయ్య స్త్రీ పాత్రల్లో ప్రేక్షకుల మన్ననలందుకున్నా రని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ రంగస్థల కళాకారులు సంఘం కార్యదర్శి జి.సుబ్బారావు, టి.శివశంకర్, జి.దుర్గాప్రసాద్, పి.సుబ్రహ్మణ్యం, వి.శ్రీరామమూర్తి, పి.సుబ్బారావు, కె.మదు, ఎల్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

రఫీ కుటుంబానికి ధూళిపాళ్ళ నరేంద్ర పరామర్శ

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని గొడవర్రులో తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు షేక్ మహమ్మద్ రఫీ తల్లి షేక్ షహినాబి ఆదివారం సాయంత్రం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆ గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల టిడిపి అధ్యక్షులు మైలా వెంకటరామరాజు, మండల టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

కిట్స్‌లో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో సిఎస్ఇ-డిఎస్ విభాగం బ్రెయినో విజన్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్ సౌజన్యంతో ఐదు రోజులపాటు ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ నేషనల్ వర్క్‌షాప్ ప్రారంభించారు. వెబ్ అప్లికేషన్స్ ఎలా డెవలప్ చేయాలి, విద్యార్థుల్లో ఉన్న ఇన్నోవేటివ్ ఆలోచనలను ఎలా సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్స్‌గా తయారు చేయాలో విశదీకరించారు. ఈ సందర్భంగా కాలేజి చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక పద్ధతులు, టెక్నాలజీని ప్రతి విద్యార్థి నేర్చుకుని ఇండస్ట్రీకి కావాల్సిన నైపుణ్యాన్ని కళాశాలలోనే నేర్చుకోవటం మంచిదని తెలియజేశారు. కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ఇలాంటి నేషనల్ వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులు, ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ బి.భానుప్రకాష్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

విజ్ఞాన్స్‌లో ఎంటెక్ ఐవోటీ కోర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 100శాతం ఫీజు రాయితీతో కూడిన ఎంటెక్- ఐవోటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) కోర్సును ప్రారంభిస్తున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ సోమవారం తెలిపారు. సోమవారం కోర్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కోర్సుకు విజయవాడలోని ఎఫ్టానిక్స్ కంపెనీ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. బీటెక్‌లో ఈసీఈ, ఈఐఈ, ఈఈఈ, ఈసీఎమ్, సీఎస్ఈ, ఐటీ పూర్తిచేసిన విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్షను ఆగస్టు 5న విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.10,000 వేతనంతో కూడిన స్టైఫండ్ కూడా అందిస్తామని వెల్లడించారు. అంతేకాకుండా రియల్ టైమ్ లైవ్ ప్రాజెక్టులను చేయించడంతో పాటు రెండు సెమిస్టర్‌లు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఇండస్ట్రీలోనే ఉండే విధంగా డిజైన్ చేశామన్నారు. ఎంటెక్ - ఐవోటీ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామి ఇచ్చారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు 9885342118, 9703551269 సంప్రదించవచ్చునన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీసీ, తదితరులు

షేక్.అస్మత్‌కు 'సేవ ఆరోగ్యమిత్ర' అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు :ఆరోగ్యశ్రీ పథకం కింద జూన్- 2023ల ఉత్తమ సేవలు అందించినందు కుగాను తెనాలి జిల్లా వైద్యశాలలో పనిచేస్తున్న షేక్.అస్మత్ తారకు 'సేవ ఆరోగ్యమిత్ర ' ప్రశంసా పత్రంతోపాటు రూ.5వేలు నగదు బహుమతిని కలెక్టర్ యం.వేణుగోపా ల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి చేతులమీదుగా అందజేశారు. ఇదే విధంగా పనిచేసి ఆరోగ్యశ్రీ పథకానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ సూచించారు.

అవార్డును అందచేస్తున్న కలెక్టర్, జెసి

జిఎంసి స్పందనకు 42 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్పందన అర్జీలను నిర్దేశిత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలని, అర్జీలు రీఓపెన్ అయితే విభాగాధిపతులే స్వయంగా పరిశీలించి పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి, వాట్స్ అప్, కాల్‌సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.వాటిల్లో పట్టణ ప్రణాళిక విభాగం 8, ఇంజినీరింగ్ విభాగం 16, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం 3, అకౌంట్స్ విభాగం 3, పరిపాలన విభాగం 1, ఉపాసెల్ విభాగం 3 ఫిర్యాదులు, మొత్తం 42 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. ఆయా ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపాసెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

సబ్ కలెక్టర్ స్పందనలో ఎనిమిది అర్జీలు

ప్రజాశక్తి-తెనాలి :డివిజన్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మొత్తం ఎనిమిది అర్జీలు దాఖలైనట్లు డిఏఓ తెలిపారు. వాటిలో రెవిన్యూ శాఖకు సంబందించి మూడు, తెనాలి పురపాలక సంఘానికి సంబందించి రెండు, పంచాయతీరాజ్‌కు సంబందించి ఒకటి, పోలీసు శాఖకు సంబందించి రెండు అర్జీలు దాఖలయ్యాయి. వాటిని నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు పంపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో పోరుయాత్రను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు డి.శ్రీనివాసకుమారి

ఐద్వా పోరుయాత్రను జయప్రదం చేయండి

విస్తృత ప్రచారంలో నాయకుల పిలుపు - 7న గుంటూరు, పల్నాడు జిల్లాలకు రానున్న జాత

మహిళలపై హింస, దాడులను అరికట్టాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని జులై 28వ హిందూరురంలో ఐద్వా ఆధ్వర్యంలో ప్రారంభమైన హింసపై మహిళల పాదయాత్ర ఆగష్టు 7న పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పర్యటించనుంది. జాతాను జయప్రదం చేయాలని ఐద్వా ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న పోరుయాత్రను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి కోరారు. సోమవారం సాయంత్రం నులకపేటలోని ఎమ్మెల రామయ్యకాలనీలో మహిళలనుద్దేశించి ఆమె మాట్లాడారు. హింస లేని సమాజం కోసం ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించి యువత భవిష్యత్తుకు దారి చూపాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా చిన్నారులు, మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న హింస పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా మల్ల యోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన ఇందుకు నిదర్శనమన్నారు. దేశంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట క్రూరంగా హత్య చేస్తున్నారని అన్నారు. జరుగుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చేవి కొన్ని అయితే రానివి ఎన్నో ఉన్నాయన్నారు. ఉత్తరప్రదేశ్, హైదరాబాద్, ఢిల్లీ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతాల్లో మహిళలపై హత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన నిర్భయ, దిశ చట్టాలు ప్రచారాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఐద్వా ఆధ్వర్యంలో అనంతపురం నుంచి ప్రారంభమైన పోరుయాత్ర తాడేపల్లి బైపాస్‌రోడ్డు రానుందని తెలిపారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.మల్లేశ్వరి, ఎన్.తులసమ్మ, మీరాబి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి వస్తున్న సందర్భంగా జాతాను జయప్రదం చేయాలని స్థానిక పుతుంబాక భవన్‌లో ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ మాట్లాడుతూ దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలో ఒకే వ్యక్తి ముగ్గురిని ఐదు సంవత్సరాలుగా అత్యాచారం చేశాడని, అతడిని కఠినంగా శిక్షించలేదని చెప్పారు. రెజ్లర్స్ విషయంలో కూడా బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషన్ అనాగరకంగా ప్రవర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మహిళలకు రక్షణ లేకుండా పోయింది విచ్చలవిడిగా మద్యాన్ని రాష్ట్ర ఆదాయం కోసం పంపిణీ చేయడం జరుగుతుందని, దీనివల్ల కుటుంబాలు నాశనమవు తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 7న సత్తెనపల్లి వస్తున్న మహిళ యాత్రను జయప్రదం చేయాలని వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, రైతు సంఘం నాయకులు జి బాలకృష్ణ, పెండ్యాల మహేష్, చేనేత సంఘం జిల్లా కార్యదర్శి వీరబ్రహ్మం, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జడ రాజకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు దిగి అమూల్య, మహిళా సంఘం నాయకులు సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు ఉపాధ్యక్షులు ధరణికోట విమల ,మునగాజ్యోతి పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 182 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు : స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అందించిన అర్జీలను నిర్ణీత గడువులోగా సంబంధిత అధి కారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం . వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి , జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వెంకట శివరామి రెడ్డి , డిప్యూటీ కలెక్టర్ లలితా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 182 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ జె. మోహన్‌రావు, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూధనరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య, డిపిఓ కేశవరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ చేయాలని, ఇతర ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో స్పందనలో అర్జీ అందచేశారు. 2018 పిఆర్‌సి గడువు ముగిసి 15 నెలలు దాటినా కొత్త వేతన ఒప్పందానికి యాజమాన్యం సిద్ధపడట్లేదని విమర్శించారు. పక్క రాష్ట్రం తెలంగాణాలో కంటే ఏపీలో 30 శాతం తక్కువ వేతనాలు ఉన్నాయని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరిస్తామని, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేసి హామీలు విస్మరించారన్నారు. చనిపోయిన జెఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించని ఎడల 10వ తేదీ నుండి సమ్మెలోకి వెళతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు దాసరి వెంకటేశ్వరరావు, ఎన్.గురుబ్రహ్మం, జి.నాగరాజు, నవీన్ తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో స్పందనలో అర్జీ అందచేశారు. కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, బిల్లులు వేతనాలు ప్రతి నెలా 5వ తేదీలోగా అందించాలని, గ్యాస్, వంటపాత్రలను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి, నిర్వీర్యం చేయొద్దని కోరారు. రాజకీయ వేధిం పులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పిం చాలని, రిటైర్మెంట్ సౌకర్యాలు కల్పించాలని తదితర డిమాండ్లపై అర్జీ అందచేశారు. కార్యక్రమంలో యూని యన్ జిల్లా గౌరవాధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, షమ్మీ, బసవకుమారి తదితరులు పాల్గొన్నారు.